

# మృత్యువు ఆత్మహత్య

కె. గణపతిరావు, వాసు

"తారా! నన్ను పెళ్ళి చేసుకుంటావటే?" తారే కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అడిగాను.

"మళ్ళీ ఇలా అన్నావంటే ఇంకెప్పుడూ నీతో మాట్లాడను" అంది చిరుకోపంతో నా ముక్కు పట్టుకుని.

'అది కాదు. సీరియస్‌గా అడుగుతున్నాను."

"అలా అడగొద్దని నేను సీరియస్‌గానే చెబుతున్నాను."

"ఏం ఎందుకుని?" ఉత్సుకతగా అడిగాను.

"అసలు నేను పెళ్ళి చేసుకోగూడదనుకుంటున్నాను."

"నువ్వనుకుంటే సరి పోతుందా?"

"అమ్మా నాన్నా నా మాట ఎప్పుడు కాదన్నారమ్మా! అయినా నాకు పెళ్ళయి వెళ్ళి పోతే వాళ్ళనెవరు చూసుకుంటారని" కాస్త గంభీరంగానే అంది. తార చూపులు శూన్యంలో సుళ్ళు తిరుగుతున్నా చూడ్డానికి మాత్రం నిశ్చలంగాను, దృఢంగాను ఉన్నాయి...

"ఆడదాని జీవితానికి పరిపూర్ణత సిద్ధించేది పెళ్ళితోనే."

"ఈ డైలాగ్ ఏదైనా కథలో వాడుకో మామయ్యా" అల్లరిగా నవ్వింది.

ఆ నవ్వు నాకిష్టం. . . తారన్నా చాలా ఇష్టం. నవ్వుతున్న తారంటే నాకు మరీ ఇష్టం. ఇంటర్ చదువుతున్న తారకి నిండా పదిహేడు ఏళ్ళయినా లేవు—బట్ షీ ఈజా జీనియస్...రష్యన్, ఫ్రెంచి, అమెరికన్ ఇంకా ఏవేవో భాషల ప్రముఖ రచయితల పేర్లు చెప్పి. . .

"కథల మావయ్యా! వాళ్ళ మాస్టర్ పీసెస్ గురించి చెప్పవా" అనడిగేది.

"ఎప్పటికైనా నీ మాస్టర్ పీస్‌లో నాకు భాగమివ్వవూ" అని చాలాసార్లు అడిగింది.

"నీ మీదో కథ రాస్తాను అండ్ ఇట్ విల్ బి మై మాస్టర్ పీస్" అనే జవాబు నాదగ్గరెప్పుడూ రెడీగా ఉండేది.

"ఏమిటి మామయ్యా! అలా ఆలోచిస్తున్నావ్? నే చేసుకోనన్నంత మాత్రాన నీకు పెళ్ళే కాకుండా పోతుందా! ఎవరో ఒకరు చేసుకుంటారులే! లేకపోతే నువ్వే ఎవరో ఒకర్ని చేసుకో, పోకే!"

"నువ్వు మాత్రం చేసుకోనంటావ్! అంతేనా."

"మొన్ననే ఒక సైన్స్ మాగజైన్‌లో ఒక ఆర్టికల్ చదివాను మావయ్యా! జెనిటిక్స్ ప్రకారంగా అక్కయ్య కూతురుని చేసుకుంటే పుట్టే బిడ్డలు అంగవైకల్యంతోనో, మంద బుద్ధితోనో, అర్థాయుష్షుతోనో పుడతారు."

"మరి మా అక్క—అదే మీ అమ్మ కూడా మీ నాన్నకి అక్క కూతురేగా?"

"అందుకేగా నేను అర్థాయుష్షుతో పుట్టింది'

"తారా! ! !"

"క్యా హువా సాబ్" డ్రైవర్ ఆటోని ఆపి నావైపు ఆశ్చర్యంగా చూచాడు. ఆలోచనల మధ్య మెదడు మొద్దుబారిపోతూంటే "కుచ్ నహీ! జరా జల్దీ లేజావ్" అన్నాను కాస్త తేరుకుని.

రోజూ చూసే బేగంపేట విమానాశ్రయం 'రన్‌వే' నిర్మానుష్యంగా మృత్యువు చాచిన నాలుకలా ఉంది. అందంగా కనిపించే టాంక్‌బండ్ నరకానికి ముందు నడవలా, విశాలంగా పరచుకుని ఉన్న హుస్సేన్‌సాగర్ అనంత విశ్వంలో కలిసిపోయిన ఆర్తుల కన్నీటి కొలనులా ఉంది. అస్తమయ భానుడు అర్ధాంతరంగా దూరమైన ప్రియురాలిని తలచుకుని కుమిలిపోయే అభాగ్యుడిలా ఉన్నాడు. . .

"మావయ్యా! నీ కో సర్‌ప్రైజింగ్ న్యూస్... నే నో నవల రాస్తున్నా"

"ఆల్ ది బెస్ట్"

"కానీ మావయ్యా! నా దో డవుట్—ధైర్యంగా మృత్యువును ఎదుర్కొని దానితో హోరాహోరీ పోరాడి గెలుపో, ఓటమో ఏదో ఒకటి చవి చూసి మొత్తానికి మానవ ప్రయత్నం చేశామని తృప్తి పడడం గొప్పంటావా! లేక దాన్ని ఫేస్ చేయలేక భీరువులా పక్కకు జరిగి పోయి, దాని గెలుపుకి కావలసిన ఎట్మాస్ఫియర్ క్రియేట్ చేసి కర్మ సిద్ధాంతాన్ని కాళ్ళకు చుట్టుకుని కూర్చోవడం గొప్పంటావా? అలా చూడకు—ఇది నా నవల ప్లాటు."

"మరీ అంత హెవీ సబ్జక్టు ఎన్నుకోకు.


"ఏమ్మా మావు రాసేద్దామనా? అలా సైలెంట్‌గా ఉన్నావేం?"

"డాక్టర్! ఏమన్నాడు"

"త్వరగా నయమై పోతుందన్నాడు."

'సాబ్' అన్నాడు ఆటో డ్రైవరు. ఆలోచనల నుండి తేరుకుని చుట్టూ చూశాను. నాంపల్లి స్టేషను వచ్చేసింది. డబ్బు లిచ్చి లోపలి కెళ్ళి టికెట్టు కొన్నాను యాంత్రికంగా. ప్లాట్ ఫామ్‌పై నిలబడి ఉన్న గోదావరి ఎక్స్‌ప్రెస్ వైపు నడిచాను

ఖాళీగా ఉన్న ఒక కంపార్టుమెంటు నెక్కి ఒక మూలగా సెటి లయ్యాను. ఎందరో అదృష్టవంతుల్ని దురదృష్టవంతుల్ని, ఆర్తుల్ని అభాగ్యుల్ని, ఆశాజీవుల్ని, నిరాశావాదుల్ని అక్కున చేర్చుకున్న రైలు



కాలంలా ప్రాణం దొర్లిపోతుంటే విర్లిప్తంగా చీకట్లోకి చూస్తూ కూర్చున్నాను.

"అదేమిట్రా హఠాత్తుగావచ్చావ్" అంది అక్కయ్య ఆత్రుతగా. . . అంతగా ఖంగారు పడవక్కర్లేదని ఉత్తరంలో రాశాంగా. . . స్నానం చేసి రా" చేసిన ఎయిర్ బాగ్ను అందుకుంది.

"తారేది?"

"దానికి ఇంట్లో కాలు నిలుస్తుందా. వాళ్ళ ఫ్రెండింటికి వెళ్ళింది".

"అంటే ఒంట్లో". . .

"ఇప్పుడేం లేదులే. ఐదే మరి కొచ్చినట్టే మళ్ళీ గుండె నెప్పొచ్చింది" అంటూ కంటెంట్లోకి వెళ్ళింది.

అక్కయ్య మొహంలో ఏదో చెప్పాలన్న ఆదుర్దా, చెప్పలేని అసహాయత స్పష్టంగా కనిపించాయి. ఆఖరికి నేనే "అసలేమిటసలే" నిలదీశాను చెయ్యి కడుక్కుంటూ. .

"ఇప్పుడు దాని ప్రాణం ఖరీదు పది వేలు. అదీ ఈ ఏడాదిలోగా అయ్యితేనే" అంతకంటే ఎక్కువ మాట్లాడ లేకపోయిన అక్కయ్య కళ్ళు ఒత్తుకుంటూ లోపలికి వడిచింది.

వరండాలో పడకకు ర్చీలో కూర్చున్నాను ఒంటరిగా వెలితిగా.

కాలం ఒక్కసారి రెండేళ్ళ వెనక్కి వెళితే ఎంత బాగుండును" అనుకున్నాను. అవును. . . సరిగ్గా రెండేళ్ళ క్రితం తారు మెట్ల మీద నుండి పడి పోయింది. . . అప్పుడు ఒక మెట్టు చివరి అంచు గుండెను బలంగా తాకింది. ఫస్ట్ ఎయిడ్ వల్ల బయటికి కనిపించే గాయం నాలుగు రోజుల్లో మానింది.

"హాయ్ కథల మావయ్యా. ఎప్పుడూ వస్తే?" అలవోకగా తల తిప్పి తారను తేరి పార చూశాను. తారులో ఎలాంటి మార్పు లేదు. అదే చిలిపితనం. అదే నవ్వు. . .

"హౌ ఆర్ యూ తారా?"

"వెల్ ఎవర్" కాదా అమ్మా అన్నట్టుగా అప్పుడే అక్కడకు వచ్చిన అక్కయ్య కేసి చూసింది.

"ఇవాళ సాయంకాలం సినిమా కెళ్ళాలిగా. అందు కని రెస్ట్ తీసుకో. ఈ లోపులో నేను శకాలు పూర్తి చేస్తాను" అంటూ పుస్తకాల షెల్ఫ్ కేసి వెళ్ళింది.

సాయంత్రం సినిమా కని బయలు దేరా మిద్దరమూ. . . తార నాకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదు. ఏదో చాలా ఇంట్రెస్టింగ్‌గా చెప్పుకు పోతున్న తార వాక్ప్రవాహానికి 'సిగరెట్టు కాల్చా లన్న నా కోరిక' వారధి వేసింది.

పాన్ షాప్ దగ్గర సిగరెట్టు అంటించుకుని వచ్చాక మళ్ళీ నడక ప్రారంభించాం.

"మావయ్యా! స్మోకింగ్ ఇంజూరియస్ టు హెల్త్."

"తెలుసు".

"మై గాడ్! తెలిసీ తాగుతున్నావా. అంతే మావయ్యా. మిస్టీరియస్ లైవ్. . . కొందరు శిఖరాల్ని అందుకోవాలని విఫలులౌతారని తెలిసీ జారి పోతున్న జారుడు మెట్ల మీది నుంచి పైకెళ్ళ డానికి ప్రయత్నిస్తుంటారు.' ఆస్టి కాంగ్రీ శిఖరాల మీదున్న వాళ్ళు జారుతారని తెలిసి తెలిసీ జారుడు మెట్లపై కాలేసి పతనానికి దిగజారు

# నిర్వచనం

నువ్వన్నట్టు
జీవితం-బుద్బుదం కాదు
చితికిపోవడానికి
మంచు బిందువూ కాదు
కరిగిపోవడానికి.
అది భాగీరథీ-స్రవంతి
హిమనిధి-అక్షయం.

ఎస్. మునిసుందరం

తుంటారు. ఆ పతనాన్ని స్పోర్టివ్‌గా తీసుకోకపోవటమే కాకుండా ఆ ఫీట్ చేస్తున్నందుకు ఎంతో గర్వ పడతారుకూడ.

"నువ్వు రాయబోయే నవల్లోని డైలాగా?"

"అదేం కాదులే. నవలంటే గుర్తు కొచ్చింది నీ మాస్టర్ పీస్ ఎంత వరకొచ్చింది. నా పాత్ర మాత్రం జాగ్రత్తగా రాయాలి సుమా."

"అద్సరే. డాక్టరేమన్నాడు?"

"నథింగ్ సీరియస్, మొన్న మళ్ళీ గుండె నొప్పొచ్చింది. అమ్మా నాన్నల కంగారు తెలుసుగా! వెంటనే కెజిహెచ్‌లో జాయిను చేశారు. ఈసిజి, ఎక్స్‌రే పరీక్షలన్నీ అయ్యాక హార్ట్‌కి సంబంధించిన రెండు వాల్వ్స్ రీప్లేస్ చెయ్యా లన్నారు."

"అంటే హార్ట్ వాల్వ్ ట్రాన్స్‌ప్లాంటేషనన్న మాట" గొప్పోతూ అడిగాను.

"ఎగ్జాక్ట్లీ! అయినా అదంత అవసరం అనిపించ టంలేదు."

"పెద్ద మెడికో లా మాట్లాడకు. ఇంకా ఏమన్నారు."

"నాకు తెలిసిం దంతే! ఇక మీదట ఏ హాస్పటల్‌కి వెళ్ళనని నాన్నతో స్ట్రాంగ్‌గా చెప్పేశాను. లేకపోతే ఏమిటి మామయ్యా! అసలే వీళ్ళకి కంగారు. దానికి తోడు డాక్టర్లు మహా బెదరగొట్టేస్తున్నారు. ఇంట్లో నే మున్నప్పుడు బలవంతంగా నవ్వుతున్నారు. నేను లేనప్పుడు భోరున ఏడుస్తున్నారు. అందుకు వాళ్ళ ముఖాల కన్నా వేరే సాక్ష్యాలు నా కనవసరం. అసలు నా కేమైందని?" నాలోని సంచలనాన్ని. ఆందోళనను కనబడనీయకుండా థియేటరులోకి తారతో సహా అడుగుపెట్టాను.

రాత్రి భోజనాలయ్యాక నేను, బావా బయటికి వెళ్ళాం. అప్పుడు విషయమంతా వివరంగా చెప్పాడు. ఆపరేషను చేయాలంటే వెల్లూరుకాని, పెరంబూరు గాని తీసుకు వెళ్ళాలట. పదివేలు దాకా ఖర్చుపెట్ట గలిగితే తప్ప తారను దక్కించుకోవడం కష్టమంటూ బాధగా తల వాల్చాడు.

మధ్యతరగతి వాళ్ళకి పదివేలు అంటే సామాన్య మైన మొత్తం కాదు. తన ఒక్కగా నొక్క కూతురు కోసం ఏమైనా చేయాలన్న కోరిక ఉన్నా ఎలా సంపాదించాలో తెలీక నిస్సహాయంగా పసిపిల్లాడిలా కంట తడి పెట్టుకుంటున్న బావను చూడగానే నా కళ్ళూ చెమ్మగిల్లాయి.

"అగ్గిపెట్టిస్తావా బాబూ" అన్న ప్రక్క ప్రయాణికుడి పిలుపుతో నా ఆలోచనలు చెదిరి పోయాయి. క్షణక్షణం పీడిస్తున్న జీవితాన్ని అందు కోవాలని పరుగులు తీసే నగటు మనిషిలా చీకటిని దూసుకుంటూ రైలు గమ్యం వైపు ఉరకలెత్తు తోంది.

నిద్రాదేవి ఒడిలో విశ్రమించిన ఎందరో ప్రయా ణికుల మధ్య కూర్చున్న నేను నిద్రరాని కళ్ళతో జేబులోని టెలిగ్రామ్‌ను మరో మారు చదవాలని ప్రయత్నించి చదివే శక్తి లేక నీళ్ళు నిండిన కళ్ళతో నిట్టూరుస్తూ వెనక్కి జారగిలబడ్డాను ...

* * *

ఆటో దిగి ఇంట్లో అడుగుపెట్టిన నాకు

**13—6—79**

ఇల్లంతా స్మశానంలోని స్తబ్దత ఆవరించినట్టుగా అనిపించింది. గదిలో అక్క మంచం చుట్టూ నిలబడ్డ ఆడవాళ్ళు నన్ను చూసి ప్రక్కకు జరిగారు. పగల బోతున్న గుండెని పొదివి పట్టుకొని నెమ్మదిగా మంచాన్ని చేరాను. బాగా ఏడ్చిఏడ్చి అలసిపోయి నట్టు పడి ఉన్న అక్కయ్య నన్ను చూడగానే బావురు మంటూ నన్ను పెనవేసుకు పోయింది.

"బాబూ! తార మనల్ని అన్యాయం చేసిందిరా" ప్రేవులు మెలితిరిగి పోతున్నంత బాధతో ఆక్రోశి స్తుంటే పసిపిల్లాడిలా నేనూ ఏడ్చేశాను.

ఏమని వూరడించను? ఏం చెబితే ఈ అగాధం పూడుకుంటుంది. నిండు జాబిల్లిలా అందర్నీ మురి పించిన తార "ఉల్క"లా రాలిపోయిందని కుమిలిపోవటం మినహా నేనేం చేయగలను?

"ఏ జన్మలో ఏ పాడు నోము నోచానో ఏ తల్లీ కూతుళ్ళని విడదీశానో."

యుగాల తరబడి కడుపు చించుకు వచ్చిన బిడ్డల కోసం ప్రతి తల్లీ పడే ఆవేదన ... నా కన్నీటితో అక్క శిరస్సును అభిషేకించానే తప్ప ఒక్క మాట కూడా మాట్లాడలేక పోయాను.

అక్క అలా ఏడుస్తూనే 'ఫిట్' వచ్చిందానిలా సొమ్మసిల్లి పోయింది.

బయట స్తంభా న్నానుకుని నిలబడ్డ పెద్దమ్మ దగ్గరికి వెళ్ళాను.

"అంతా అయిపోయిందన్న మాట" తారను కడసారి చూపుకైనా చూడలేక పోయానన్న బాధతో నా గొంతు పూడుకుపోయింది.

"......"

పెద్దమ్మ సమాధానం విన్న నేను మరీ ఘోర మైన షాక్ తిన్నాను.

"తార ఎక్స్‌పైర్డ్" అన్న టెలిగ్రామ్‌కి అర్థం తార గుండె జబ్బు వలన పోవడం కాదన్న మాట ... స్నేహితులతో ఆశ్రమానికి వెళ్తూ, ప్రమాదవశాత్తూ రైలులోనుండి జారిపడిందట ...

రైల్వే ఆసుపత్రిలో ఉన్న తార శవాన్ని తీసుకు రావటానికి వెళ్ళిన బావ ఇంకా రాలేదు.

మృత్యువు మరో రూపంలో ఆవరించింది.

డబ్బుతో తారను దక్కించుకోవాలని కలలు కన్నాం.

కాని విధి ఈ విధంగా మా ప్రయత్నాలను పరిహ సిస్తుందని వూహించలేకపోయాం.


టాక్సీ ఇంటి ముందాగింది. తార శవాన్ని వరండా లోకి తెస్తుంటే ఘొల్లుమన్నా రంతా.

సిరివాళ్లె పువ్వులాకళకళలాడేతార, సంపెంగఛాయతో వెలిగిపోయే తార, శరీరమంతా కమిలి నీలంగా మారిపోయింది. నిర్మలంగా, నిష్కల్మషంగా వర్తించె కనుదోయి కదలికలను కనపడనీయకుండా రెప్పలు మూసుకుని ఉన్నాయి.

అక్కా బావల్ని చూడలేకపోయాను.

గుండెలు పగిలేలా ఏడ్చే అక్కయ్యను చూస్తుంటే మృత్యువు మనిషి నెంత దారుణంగా నికృష్టంగా వోడిస్తుందో అర్థం చేసుకున్నాను.

దేవుడే ఉండి ఉంటే, అక్కయ్య దీనాలాపనలే విని ఉంటే, కడుపు కోతతో అలమటించే అక్కయ్యను చూసి ఏమీ చెయ్యలేని తన అసమర్థతకి




సిగ్గుతో ఎర్రంగా రాలుగా మారిపోయి ఉండేవాడు...

"మావయ్యా! స్నానానికెళ్తుంటే అలా కొంటెగా చూడడానికి సిగ్గు లేదు" అని బిడియాన్ని ప్రక టించె తారకు అందరి ముందే అభ్యంగన స్నానం చేయించారు.

పెళ్ళి వద్దన్న తారకు పెళ్ళి కూతురులా అలంక రించారు.

ఇంకా బ్రతికే ఉందన్న భ్రమ కల్పించే జీవ కళతో ఉట్టిపడుతున్న తార ముఖాన్ని కసివు తీరా ముద్దు పెట్టుకుని, బాల పేరంటాలుగా తీర్చి దిద్దిన అక్క బావలు తారను తిరిగి రాని మెట్టి నింటికి పాడిపై సాగనంపారు.

ఒక అధ్యాయం ముగిసింది. సమరసాలా ఒలి కిస్తుందనుకున్న కావ్యం కేవలం విషాదమయమై అసంపూర్తిగా మిగిలి పోయింది.

పది రోజులు గడిచాయి...

కర్మకాండలన్నీ పూర్తయ్యాయి...

అక్కయ్యలో అణుమాత్రమైనా మార్పు లేదు. నాకూ ఓదార్చే శక్తి లేదు. అందుకే గాలి మార్పు కోసం హైదరాబాద్ రమ్మని అడిగి విఫలుడ్నయి పదిహేనవ రోజున బయలు దేరాను.

ప్రతిసారి స్టేషనుకొచ్చి వీడ్కోలు చెప్పే తార గుర్తొచ్చి రైలు కదులుతున్న వేళ నా కళ్ళు ఉరిమినట్టుగా వర్షించాయి. తారకు శాశ్వతంగా వీడ్కోలు చెప్పిన నన్ను ఎక్కించుకున్న రైలు భారంగా కదిలింది.

• • •

నాంపల్లి స్టేషనులో రైలు దిగి ఇంటికి చేరాను. నిర్లిప్తంగా రూంలోకి అడుగు పెట్టిన నాకు తలుపు మూలగా ఒక కవరు కనిపించింది. దస్తూరీ గుర్తు పట్టిన నా గుండె వేగంగా కొట్టుకోసాగింది.

"మావయ్యా!

నా మరణం ఏక్సిడెంటల్‌గా జరిగిందని అందర్నీ మోసం చేస్తున్నాను. కాని ఈ అల్లరి మావయ్యకు మాత్రం అసలు విషయం చెప్పకుండా ఉండలేక పోతున్నాను...

ఇన్‌ఫాక్ట్ నా చావు ప్రీప్లాన్డ్ అండ్ ఇన్సి డెంటల్. ఎందుకో చెప్పనా—పదివేలు సంపాదించడ మన్నది నాన్న తాహతుకు మించిన పని. అలా వారి అసమర్థత వలన నా ప్రాణాలు పోతే బహుశా వాళ్ళా బ్రతకరేమో కూడా. కొడుకుల్లేని అమ్మా నాన్న లకు అన్నీ నేనే అయి ఎల్లకాలం కావాలని ఎన్నెన్నో కలలు కన్నాను. ఆఖరికి ఏమీ చేయకుండానే పోతున్నానని తెలుసుకుని ఎంతో కుమిలి పోయాను. చేస్తూ వారికేం చేయలేక పోయినా నన్ను బ్రతికించుకోలేని వారి వేదనకానికి జీవితాంతం కుమిలి ఏడ్చే పరిస్థితిని తప్పించాలనుకున్నాను. అందుకే ఈ ప్రమాదం, ఇలా నా మరణం తప్పని సరైంది.

అవును మామయ్యా! నా కథకి నేనే ఒక చిన్న మలుపుని సృష్టించుకున్నాను. మరి నీ "మాస్టర్ పీస్" లో నేను ఉంటాను కదూ... ఉంటే ఇది నేనే అని అమ్మా నాన్నలకు మాత్రం తెలియ నివ్వకు..

కథల మావయ్యా! ఇదుగో.. అలా కళ్ళు చెమ్మగిల్లనివ్వకు...

గుడ్ బై ఫరెవర్

తార."

"తారా! వాస్తవాన్ని ఇలా ఓడించావా?'

నిర్లిప్తంగా రాలిన రెండు కన్నీటి బొట్లు ఉత్తరంలోని 'తార' అన్న అక్షరాల్ని చెరిపేశాయి ✱

**30-5-79 సంచికలో ప్రచురించ బడిన 'మృత్యువు ఆత్మహత్య' కథలో పొరపాటున కొంత భాగం వదలివేయడం, దాని స్థానంలో వేరొక కథలోని కొంత భాగం కలవడం జరిగింది. ఈ సంచికలో ఆ కథ మళ్ళీ పూర్తిగా ప్రచురిస్తున్నాం.**